# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ మారిషస్ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం మరింతగా విస్తరిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ మాదక ద్రవ్యాల రహిత భారతదేశాన్ని రూపొందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ❖ దేశ అవసరాలకు తగినట్లుగా విత్తన నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ ప్రపంచంతో పోటీ పడే శక్తి భారతీయ కార్మికులకు ఉందని కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా అన్నారు.

============================

డిజిటల్ టెక్నాలజీ, అంతరిక్షం వంటి నూతన రంగాలలో భారత్ మారిషస్ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం ప్రస్తుతం విస్తరిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. మారిషస్ ప్రధాన మంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులాం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్మును ఈ రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం, సహకారం ప్రతి రంగంలోనూ స్థిరంగా పెరుగుతోందన్నారు. మారిషస్ ప్రభుత్వ అభివృద్ధి ప్రాధాన్యతలకు భారతదేశం మద్దతు ఇస్తోందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో భారతదేశం-మారిషస్ మధ్య దీర్ఘకాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు.

============================

మాదక ద్రవ్య రహిత భారతదేశాన్ని రూపొందించాలన్నది ప్రభుత్వం లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో రెండవ జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక టాస్క్ ఫోర్స్ (ANTF) సమావేశాన్ని ఆయన ఈ రోజు

ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మాదకద్రవ్యాల వ్యతిరేక టాస్క్ ఫోర్స్ అధిపతులు, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. దేశం నుండి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకుందని తెలిపారు. విదేశాల నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులందరినీ భారత చట్టాల పరిధిలోకి తీసుకువస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్ని విభాగాలు కలిసి పని చేసినప్పుడు మాత్రమే మాదక ద్రవ్యాలపై పోరాటం విజయవంతం అవుతుందని అమిత్ షా పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

============================

దేశ అవసరాలను తీర్చడానికి తగినంతగా విత్తన నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2025-26 రబీ సీజన్‌కు జాతీయ ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యాన్ని 360 మిలియన్ టన్నులుగా నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం లక్ష్యం 2024-25లో సాధించిన ఆహార ధాన్యాల ఉత్పత్తి కంటే 2.4 శాతం ఎక్కువగా ఉందని వెల్లడించారు. వ్యవసాయ రంగంలో సమన్వయం, సమిష్టి భాగస్వామ్యాలను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

============================

ప్రపంచంతో పోటీ పడే శక్తి భారతీయ కార్మికులకు ఉందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భారతీయ కార్మికుల సామర్థ్యాలను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO)ల మధ్య దృశ్య మాధ్యమ విధానంలో ఈ రోజు ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై సంతకం చేసిన సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ప్రపంచ మార్కెట్ అవసరాలకు తగినట్లుగా భారతీయ కార్మికుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, డిజిటల్ ఆవిష్కరణలను ఉపయోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఒప్పందం ద్వారా దేశీయ యువత ప్రపంచ ఉపాధి అవకాశాలను పొందడం మరింత సులభతరం అవుతుందని చెప్పారు. దేశీయ కార్మికులు ప్రపంచ కార్మిక మార్కెట్ ని అర్థం చేసుకుని ముందుకు సాగేందుకు సైతం ఈ ఒప్పందం సహాయపడుతుందని అన్నారు.

విరామం

============================

సేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు అంశాలపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం “సేవా పర్వ్” కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా ఈరోజు పునరుత్పాదక ఇంధన శక్తి కోసం భారత్ అమలు చేస్తున్న పలు పథకాలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 150 సెకన్లు)

============================

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల నేపథ్యంలో రానున్న రోజులలో దేశీయ వ్యవసాయ రంగం గణనీయమైన ప్రగతిని సాధించనుంది. జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రైతులకు పెద్ద ఎత్తున ఉపశమనం కలగనుంది. ఈ సంస్కరణలో భాగంగా ట్రాక్టర్లపై పన్ను శాతాన్ని 12 నుండి 5కి తగ్గించారు. అదే విధంగా టైర్లు, ట్యూబ్‌లు, హైడ్రాలిక్ పంపులు వంటి ట్రాక్టర్ భాగాలను గతంలో 18 శాతం స్లాబ్‌లో ఉన్న వాటిని 5 శాతం స్లాబ్‌కు తగ్గించారు. జీఎస్టీని తగ్గించడం ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చామని కేంద్ర వ్యవసాయం రైతు సంక్షేమ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు.

=============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=============================

దేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు రానున్న రెండు రోజులలో కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. అదే విధంగా మహారాష్ట్రలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షపాతం ఉంటుందని ఐఎండీ పేర్కొంది.

=============================
=============================